క్లుప్తంగా

మున్సిపాలిటీకి రూ.46.38 లక్షల ఆదాయం



మున్సిపల్ కార్యాలయంలో వారపు సంతకు వేలం నిర్వహిస్తున్న కమిషనర్ కే.ప్రమీల

మదనపల్లె : మున్సిపాలిటీలోని వారపు సంతకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గుత్తలు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన వేలంలో రూ.46.38లక్షల ఆదాయం లభించినట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దినసరి, వారపుసంత నిర్వహణకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. వారపుసంతకు నిర్వహించిన వేలంపాటకు ముగ్గురు గుత్తేదారులు హాజరుకాగా, సర్కారుపాట రూ.46.34లక్షలు ఉంటే, జాఫర్‌ఖాన్ రూ.46.38లక్షలకు వేలం దక్కించుకున్నారు. దినసరివారపుసంతకు సర్కారువారి పాట రూ.1కోటి18లక్షల54వేలకు నిర్ణయించి వేలంపాటలు నిర్వహించగా ఎస్.ఏ.మస్తాన్...పదివేలు అదనంగా రూ.1కోటి18లక్షల56 వేలకు అంగీకారం తెలిపారు. అయితే సింగిల్ టెండరుదారుడిని అంగీకరించేందుకు కౌన్సిల్ సమ్మతి తప్పనిసరి అని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. టౌన్‌హాల్, ప్రైవేట్ బస్టాండ్‌లకు సంబంధించి వేలంపాటల్లో పాల్గొనేందుకు ఎవరూ ఆసక్తి కనపరచలేదు.

కేశాలు దానం



కేశాలు అందజేస్తున్న విద్యార్థిని అభిరారాయల్

మదనపల్లె సిటీ : కేన్సర్ బాధితుల మోములో ఆనందం కోసం హెల్పింగ్ మైండ్స్ సంస్థ చేపట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థిని, గృహిణి కేశాలు దానం చేశారు. స్థానిక ఇందిరానగర్‌లోని హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో పట్టణానికి చెందిన గృహిణి ఉషారాణి, రమేష్,మాలతి దంపతుల కుమార్తె అభిరారాయల్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేశారు. దాతలకు నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్ పూల మొక్కలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కేన్సర్ బాధితులకు విగ్గులు తయారు చేసి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు బషీర్, హర్ష, చైతు, సాంబ, వేదిక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సకాలంలో అందించాలి

– జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ లోకవర్ధన్

తంబళ్లపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజలకు 108,104 వాహన వైద్య సేవలు సకాలంలో అందించేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. మంగళవారం ఆయన సీహెచ్‌సీలో ఎన్టీఆర్ వైద్య సేవ విభాగాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలు గురించి ఆరోగ్యమిత్ర శ్రీలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. 108 వాహనం పరిశీలించారు ప్రజలకు 108 వాహన సేవలు అందుతున్న సేవలపై ఈఎంటీ అనురాధ, పైలెట్ రెడ్డిప్రసాద్‌లను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో స్పందించి వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి



ఎంపీడీఓ అబ్దుల్‌రహీంకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కలకడ : పంచాయతీ కార్యదర్శులకు ఏకకాలంలో కేటాయించే పనుల నుంచి విముక్తిని కల్పించాలని ఎంపీడీఓ అబ్దుల్ రహీంకు పంచాయతీల కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారి సమస్యలను వివరించారు. సాఫీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడానికి సర్వేలు అడ్డంకిగా మారుతున్నట్లు తెలిపారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ వర్క్ ఫ్రం హోం సర్వే, హౌస్ హోల్డ్ జియోటాగింగ్, పి–4 సర్వే, డెత్ వెరిఫికేషన్ సర్వే వంటి 13రకాల సర్వేలతో పాటు, ఇంటిపన్ను, కుళాయిపన్ను, లైసెన్స్, లీజు వంటి 39రకాల సేవలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉన్నతాధికారులకు సకాలంలో నివేదించాలంటే వీలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పంచాయతీ కార్యదర్శి 90 రకాల యాప్‌లను పరిశీలించి అప్‌డేట్ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిపై విమర్శలు అర్థరహితం

- నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించిన ఘనత ఆయనది
- కూటమి పదినెలల పాలనలో మచ్చుకైనా కనిపించని అభివృద్ధి
- ఎల్లోమీడియా తప్పుడు కథనాలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిపై, టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితమని కురబలకోట ఎంపీపీ భూదేవి, పీటీఎం ఎంపీపీ మహమ్మద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి బి.రేవతి, జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి అన్నారు. మంగళవారం బసినికొండలోని ఎంపీ మిథున్‌రెడ్డి కార్యాలయంలో తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి చేసినంత అభివృద్ధి ఎప్పుడూ ఎవరూ చేయలేదన్నారు. 1952లో తంబళ్లపల్లె నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 2019 వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 2019 వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రతి పల్లెకు రోడ్డు, ప్రతి గ్రామానికి తాగునీరు, సాగునీరు అందించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే పనిచేశారన్నారు. పాఠశాలలను ఆధునీకరించి నాణ్యమైన విద్య అందించారన్నారు. రాష్ట్రంలోనే మొదటి సచివాలయం తంబళ్లపల్లెలోనే నిర్మితమైందన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు అవుతున్నా ఒక్క అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవన్నారు. ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేసి, రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన తప్ప అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. టీడీపీ నాయకులు ఏ ఒక్క గ్రామానికి అయినా వెళ్లారా , ప్రజలను పలకరించారా, వారి సమస్యలను పట్టించుకున్నారా అని నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమసంపాదనలకు పరుగులు, పదవుల పంపకాలకు పాకులాటం తప్ప పదినెలల్లో చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. సాగు,తాగునీటి అవసరాల కోసం తంబళ్లపల్లె, పుంగనూరు నియోజవర్గాల్లో మూడు రిజర్వాయర్ల నిర్మాణాలు ప్రారంభిస్తే, వైఎస్సార్ సీపీకి మంచి పేరు వస్తుందని అడ్డుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 650 కోట్లతో మంజూరు చేసిన హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను రద్దు చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డిపై అనవసరమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పద్మజారెడ్డి, మధుసూదన్ రెడ్డి, చౌడేశ్వర, చాంద్ బాషా, మహేష్, టంగుటూరి విశ్వనాథ్, దండాల రవిచంద్రారెడ్డి, సుభాష్‌రెడ్డి, సయ్యద్‌బాషా, సోమశేఖర్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోతబోలు లేఅవుట్ పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె : మండలంలోని పోతబోలు అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు, పునాదుల స్థాయిలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని మండల తహసీల్దార్ ధనంజయులు అన్నారు. మంగళవారం పోతబోలు అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌ను తహసీల్దార్ ధనంజయులు పరిశీలించారు. పోతబోలు లేఅవుట్లో సుమారు 400 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో ఎంత మంది అర్హులు, అనర్హులు అనేది పరిశీలించాల్సిందిగా వీఆర్వోలను ఆదేశించినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాలు చేపట్టని వారికి ప్రభుత్వం అదనంగా రూ 50 వేల రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పోతబోలు లేఅవుట్‌లో 80 కుటుంబాలు నివాసాలు ఉన్నామని, మౌలిక వసతులు లేవని స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఎండీయూ వాహనాలను పోతబోలు లేఅవుట్‌కు పంపి రేషన్ పంపిణీ జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషాద్రి రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ



మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల

మదనపల్లె : మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలు ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీని ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయిలకు 50 శాతం వడ్డీ రాయితీ వర్తించాలంటే బకాయిలతో సహా మొత్తం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2024 మార్చి నెలాఖరువరకు ఉన్న బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం జీఓ నెం.46 విడుదల చేసిందన్నారు. ఈనెల 31లోగా మొత్తం పన్ను బకాయిలు చెల్లిస్తేనే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. ఇప్పటికే ఆస్తిపన్ను చెల్లించిన వారికి రాబోయే సంవత్సరం బిల్లులో సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశామని, ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి టాక్స్‌లు కట్టించుకున్నారన్నారు. సెలవుదినాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయన్నారు.

సీతారామ కల్యాణ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న శ్రీ వరాల ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే సీతారామ కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆలయంలో ఆవిష్కరించారు. ఆలయ ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాలు ఏప్రిల్ 5వ తేదీన ప్రారంభమవుతాయన్నారు. 5న ఉదయం దీపారాధన, గణపతి ప్రార్థన, పుణాహవాచనము, నాందీ, రక్షాబంధన నిర్వహిస్తామన్నారు. యువకులకు కన్యా పాశుపత హోమం, యువతులకు స్వయంవర పార్వతీ మూల మంత్ర హోమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం వరపూజ, ఎదురుకోలు,నిశ్చితార్థం, విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు జరుగుతాయన్నారు. 6వతేదీ శ్రీరామనవమి పురస్కరించుకుని మూలవర్లకి పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



హరిణి



వి. సుహాన



బి. అజయ్



వి. శ్రీదేవి.

మదనపల్లె సిటీ : నవోదయ విద్యాలయలో 6, 9వ తరగతుల ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు మదనపల్లె నవోదయ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ తెలిపారు. పరీక్షలు రాసిన విద్యార్థులు http://cbreit.in/cbre/2025/nvrrerut/Qerut.arpx వెబ్‌సైట్‌ను క్లిక్ చేసి హాల్ టిక్కెట్టు నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు తెలుసుకోవచ్చన్నారు..

ముగ్గురు విద్యార్థుల ఎంపిక

స్థానిక సొసైటీకాలనీలోని శ్రీ మల్లికార్జున సైనిక్ నవోదయ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు స్టడీ సెంటర్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జున తెలిపారు. జి.బి.పునీత్, వి.కార్తీక్, ఎం.తీమోజీనాయక్‌లు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఎంపికై న విద్యార్థులను అభినందించారు.

హరిణి ఎంపిక

మదనపల్లె మండలం వెంకటేశ్వరపురం ఎంపీపీ పాఠశాలకు చెందిన వి.హరిణి నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైంది. హరిణి ప్రస్తుతం 5వతరగతి చదువుతుంది. ఎంపికై న విద్యార్థిని హరిణిని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నవోదయలో విద్యార్థుల ప్రతిభ

పీలేరు రూరల్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో స్థానిక భువన విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఉమారమాదేవి, ప్రిన్సిపాల్ గుణలక్ష్మీ తెలిపారు. జనవరి 18న జరిగిన ప్రవేశ పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు వి. సుహాన, బి. అజయ్, వి. శ్రీదేవి విశేష ప్రతిభతో ఎంపికైనట్లు తెలిపారు. మదనపల్లె మండలంలోని వలసపల్లె నవోదయ పాఠశాలలో 80 సీట్లు ఉండగా, తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రసంగిస్తున్న సూపర్‌వైజర్ యశోదరాణి

కలకడ : చిన్నారులు, కిశోర బాలికలు గర్భిణులు, బాలింతలు పౌష్టికారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోదరాణి అన్నారు. మంగళవారం మండలంలోని కోన అంగన్‌వాడీ కేంద్రంలో గుడిబండ, కోన, నడిమిచెర్ల, దేవులపల్లె, తదితర పంచాయతీలలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించి ఆరోగ్యసూత్రాలు తెలియజేశారు. బాల్య వివాహాలు పూర్తిగా నివారించాలని, విద్యతోనే ఉన్నతశిఖరాలు సాధ్యమని, లింగవివక్షిత చూపరాదని, ఆరోగ్యం, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాంతులు, విరేచనలు, వేసవికాలంలో వచ్చే వడదెబ్బనివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని సూచించారు కార్యక్రమంలో అన్ని అంగన్‌వాడి కేంద్రాల సిబ్బంది హాజరయ్యారు.

వగళ్ల పంచాయతీకి రికార్డు స్థాయిలో ఆదాయం

కేవీపల్లె : మండలంలోని వగళ్ల గ్రామ పంచాయతీకి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. మంగళవారం వగళ్ల, గ్యారంపల్లె వారపు సంతలకు సంబంధించి గేటు వసూలు హక్కుకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా వగళ్ల వారపు సంతను హెచ్చుపాట ద్వారా గ్రామానికి చెందిన జి. జయరామచంద్రయ్య రూ. 4.28 లక్షలకు దక్కించుకున్నట్లు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. గతంలో ఎన్నడూ రూ. లక్ష కూడా పలకని వగళ్ల వారపు సంత ఈ సారి ఏకంగా ఇంత పెద్ద మొత్తం పలకడం, పంచాయతీకి ఆదాయం రావడం పట్ల చర్చనీయాంశమైంది. అలాగే గ్యారంపల్లె వారపుసంత వేలంపాటలో రూ. 60 వేలుకు టి. వెంటరమణ హెచ్చుపాట ద్వారా దక్కించుకున్నట్లు ఈవోపీఆర్‌డీ తెలిపారు.

ఎన్‌పీటీఈఎల్ పరీక్షలలో సత్తా



ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

కురబలకోట : జాతీయ స్థాయిలో జరిగిన ఎన్‌పీటీఈఎల్ ఆన్‌లైన్ పరీక్షలలో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షలలో 445 మంది టాపర్లుగా నిలచినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ మంగళవారం తెలిపారు. గత ఏడాది జనవరి నుంచి ఏప్రిల్, జూలై నుంచి డిసెంబరు సెషన్‌కు సంబంధించి 80 శాతం పైగా మార్కులతో జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. వీరి కృషి ఫలితంగా కళాశాలకు ట్రిపుల్ ఏ రేటింగ్ కూడా లభించిందన్నారు. ఇందులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఐఐటీ, ఇతర సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశాలు రాగలవన్నారు.

గంగ జాతరకు పటిష్ట బందోబస్తు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో మంగళ, బుధవారం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న నడివీధి గంగమ్మ జాతరకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు మదనపల్లి డీఎస్పీ కొండయ్య నాయుడు పర్యవేక్షణలో నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలతో పాటు మొత్తం 120 మందికి పైగా పోలీసులను బందోబస్తుకు నియమించారు. జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ పోలీసులు గ్రామ పుర వీధులు, ప్రధాన కూడళ్లలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.

సమయం పాటించాలి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ బస్సులను సమయపాలన ప్రకారం నడపాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం డిపో కార్యాలయంలో మదనపల్లె–బెంగుళూరు రూటులో తిరిగే బస్సు సర్వీసు డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశం నిర్వహించారు. బయలుదేరు సమయం, చేరు సమయం తప్పకుండా పాటించాలన్నారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ఫోన ద్వారా ముందుగా బస్టాపు వద్దకు రావాలని తెలపాలన్నారు. ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎం రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై వినతుల స్వీకరణ

మదనపల్లె : నియోజకవర్గంలోని ప్రజాసమస్యలపై ఎమ్మెల్యే షాజహాన్ బాషా వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. ప్రజాసమస్యలపై అప్పటికప్పుడు ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆర్డీవో శ్రీనివాసులు



సమీక్షా సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు

పీలేరు : హౌసింగ్ లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పని చేసి లబ్ధిదారులను చైతన్యపరచి లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అందజేస్తున్న ఎస్టీలకు 75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు అదనపు సాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పట్టణంలో ఆర్‌వోబీ నిర్మాణాలను పరిశీలించారు. ఆర్‌వోబీ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న ఇళ్లను ఈ నెలాఖరులోపు తొలగించాలన్నారు. ఇంటి యజమానులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, హౌసింగ్ డీఈ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన భూదేవి



ఇన్‌చార్జి ఎంపీపీ భూదేవిని సత్కరిస్తున్న నాయకులు మండల పరిషత్ ఉద్యోగులు

కురబలకోట : మండల ఇన్‌చార్జి ఎంపీపీగా ఎంజీ భూదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీగా ఉన్న బి. దస్తగిరి అనారోగ్యం కారణంగా ఆరు నెలల పాటు సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో వైస్ ఎంపీపీగా ఉన్న ఆమెను మెజారిటీ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఇన్‌చార్జి ఎంపీపీగా నాలుగు రోజుల క్రితం ఎన్నుకున్నారు. జిల్లా కలెక్టర్ కూడా ఆమెను ఇన్‌చార్జి ఎంపీపీగా నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆమె మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గంగయ్య సమక్షంలో అధికారిక బాధ్యతలు చేపట్టారు. త్వరలో మండల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కొత్త ఇన్‌చార్జి ఎంపీపీ భూదేవి తెలిపారు. బీసీ మహిళనైన తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సారథ్యంలో మండల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. నాయకులకు, కేడర్‌తో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కీలక ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు ముత్ర దామోదర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ వేపలపల్లె జి. మధుసూదన్ రెడ్డి, ఎర్రబల్లె ఈశ్వర్, ఎంజీ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ గంగయ్య ఆధ్వర్యంలో మండల పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది నూతన ఇన్‌చార్జి ఎంపీపీ భూదేవిని శాలువతో సత్కరించారు.

సికిల్ సెల్ అనీమియ నిర్మూలనకు కృషి చేద్దాం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : సికిల్ సెల్ అనీమియ నిర్మూలనకు కృషి చేద్దామని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగవారం మండలంలోని తలపుల పీహెచ్‌సీ పరిధిలో గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తాండాలో సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల లోపు వయస్సు అందరూ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేపించుకోవాలన్నారు. రక్తహీనత, కళ్ళు పసుపురంగులో మారడం, ఒళ్లు, కీళ్ల నొప్పులు, అలసట, శ్వాసతీసుకోవడంలో కష్ట, గర్భదారణ సమస్యల, తరచూ అంటువ్యాధులతో బాధపడడం సికిల్‌సెల్ వ్యాధి లక్షణాలని తెలిపారు. 2045 సంవత్సరానికి వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం ప్రభుత్వోశమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు, ఏఎన్ఎం రెడ్డిబీ, కృష్ణమ్మ, సీహెచ్‌వో లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇమాం, మౌజన్లకు దుస్తులు



దుస్తులు అందజేస్తున్న మైనార్టీ నాయకులు

కురబలకోట : రంజాన్ మాసం పురస్కరించుకుని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నియోజక వర్గంలోని పెద్దమండ్యం, కురబలకోట, తంబళ్లపల్లె మండలాలలోని 54 మసీదుల ఇమాం, మౌజన్లకు దుస్తులు, ఖర్జూరం ప్యాకెట్లు మంగళవారం అందజేశారు. వీటిని ఆయా మసీదులలో జరిగిన కార్యక్రమంలో మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మైనార్టీ నాయకులు అంగళ్లు ఫజరుల్లా, తంబళ్లపల్లె మైనుద్దీన్, ముదివేడు అంజాద్‌ఖాన్, రషీద్‌బేగం, రెడ్డి బాషా, మదార్ సాబ్, హసన్‌వల్లీ, ముస్తఫా, అహ్మద్‌రఫీ, హైదర్‌వల్లీ తదితరులు వాటిని అందజేశారు.

పోషణతో పాటు విద్యను అందించాలి

సీడీపీఓ సుజాత



అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

నిమ్మనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార కేంద్రాలుగా మాత్రమే కాకుండా విద్యను అందించే కేంద్రాలుగా కూడా పనిచేయాలని సీడీపీఓ సుజాత అన్నారు. పోషణ్ బీ, పఢాయిబీ కార్యక్రమంకు సంబంధించి మూడురోజుల శిక్షణలో భాగంగా మంగళవారం మండలంలోని రెడ్డివారిపల్లె జెడ్పీహైస్కూల్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ నారాయణతో కలిసి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి పలు అంశాలపై సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ విద్యావిధానంలో భాగంగా ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ) కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లగా అభివృద్ధిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం పిల్లలకు ఆరేళ్ల వయస్సులోనే 85 శాతం మెదడు అభివృద్ధిని సాధిస్తుందని, ఆ సమయంలో సరైన పోషణ, విద్యను అందించడం ఎంతో అవసరమన్నారు. ఇందుకోసం కేంద్రం పోషణ్ బీ, పఢాయిబీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. శిక్షణలో నేర్చుకున్న పలు విషయాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది కేంద్రాల్లో అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు భానులక్ష్మీదేవి, చంద్రకాంత తదితరులు పాల్గొన్నారు.